నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 23 మే 2025 | KARIMNAGAR

## నేడు కేటీఆర్ పర్యటన

ముస్తాబాద్, మే 22 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ శుక్రవారం ముస్తాబాద్ మండలంలో పర్యటించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ముస్తాబాద్ మండలం బందనకల్‌లో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణానికి హాజరుకానున్నట్లు చెప్పారు. అనంతరం బందనకల్, ముస్తాబాద్, కొండాపూర్ గూడెం గ్రామాల్లో పలు శుభకార్యాలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నామాపూర్‌లో శ్రీవరాల మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ట, ఆవునూర్‌లో మడలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు వివరించారు.

## హుజూరాబాద్ దవాఖాన ఆర్‌ఎంవో సస్పెండ్

- సూపరింటెండెంట్ వైద్యావిధాన పరిషత్‌కు అటాచ్డ్

హుజూరాబాద్, మే 22 : హుజూరాబాద్ ఏరియా దవాఖాన ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డిపై వేటుపడింది. ఏరియా దవాఖానకు చికిత్స కోసం వచ్చే రోగులను ఆర్‌ఎంవో జమ్మికుంటలోని తన సొంత ప్రైవేట్ దవాఖానకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తోపాటు వైద్యారోగ్యశాఖ అధికారులు మూడునెలల క్రితం పలుసార్లు దవాఖానకు వచ్చి విచారణ చేపట్టారు. వీరి నివేదిక ఆధారంగా ప్రభుత్వం దాదాపు నెలన్నర కింద దవాఖానలో పనిచేసిన 14 మంది వైద్యసిబ్బందిని సస్పెండ్ చేసింది. ఈ ఉదంతంలో కర్త, కర్మ ఆర్‌ఎంవో సుధాకర్‌రావు అని విచారణలో తేలడంతో ఆయనను కూడా సస్పెన్షన్ చేసింది. చికిత్స కోసం వచ్చే రోగులను దవాఖానలో పని చేస్తున్న డాక్టర్లు సొంత క్లినిక్‌కు తరలించకుండా అడ్డుకట్ట వేయడంలో విఫలమైనందుకు సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డిని వైద్యావిధాన పరిషత్‌కు అటాచ్డ్ చేసింది. కొత్త సూపరింటెండెంట్‌గా దవాఖానలో అనస్తీషియన్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డిని, పిడియాట్రిక్‌గా పని చేస్తున్న రమేశ్‌ను ఆర్‌ఎంవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.





- 'ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు' అన్న దేశ అత్యున్నత న్యాయస్థానం
- సాగు ముఖ చిత్రమే మారిందనే వ్యాఖ్య
- నాయకుల చెంప చెల్లుమనిపించిన సుప్రీంకోర్టు
- విష ప్రచారం.. విమర్శలకు చెల్లుచీటి
- ఇప్పటికైనా ఎత్తిపోతల పథకం ప్రాధాన్యతను గుర్తించాలంటున్న నిపుణులు
- కక్షసాధింపు చర్యలు మానుకొని ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని డిమాండ్

# కాళేశ్వరంపై కాంగ్రెస్ నేతలకు కనువిప్పు కలిగేనా..?

అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నవి. ఇన్నాళ్లూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రాజెక్టుపై అర్థం, పర్థం లేని ఆరోపణలు చేస్తూ.. పబ్బం గడుపుకొంటున్న ఆ పార్టీ నాయకులకు సుప్రీంకోర్టు చెంప చెల్లుమనిపించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అంటూ గొప్పతనాన్ని, రాష్ట్రంలో మారిన సాగు ముఖచిత్రాన్ని వివరించి చెప్పిన నేపథ్యంలో.. పలువురు నేతల్లో అంతర్మథనం మొదలైంది. గత ఎన్నికల సమయంలో ప్రాజెక్టుపై విషం చిమ్మి విజయం సాధించడమే కాదు, నేటికీ అదే పంథాను అనుసరిస్తున్న ఆ పార్టీ.. ప్రస్తుతం ప్రజల ముందు దోషిగా నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ఎత్తిపోతల పథకం ప్రాధాన్యతను సర్కారు గుర్తించాలని నిపుణులు సూచిస్తుండగా, ఇప్పటికైనా కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, ప్రాజెక్టును వినియోగంలోకి తెచ్చి రైతాంగానికి అండగా నిలువాలన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.

కరీంనగర్, మే 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2016 మే 2న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. కేవలం మూడేళ్ల స్వల్ప వ్యవధిలోనే ప్రాజెక్టు పనులను పూర్తి చేసి, 2019 జూన్ 21న జాతికి అంకితం చేశారు. సాగునీటిరంగ చరిత్రలో ఇదో రికార్డు! నిజానికి గత పాలనలో ఏదైనా ఒక ప్రాజెక్టు పనులకు ఒకరు శంకుస్థాపన చేస్తే.. అది ఏండ్ల పాటు కొనసాగేది. ప్రభుత్వాలు మారి ఆ ప్రాజెక్టును మరొకరు ప్రారంభించే పరిస్థితి ఉండేది. కానీ, కాళేశ్వరం విషయంలో మాత్రం అలా జరుగలేదు. వాస్తవానికి కేసీఆర్ ఈ ప్రాజెక్టును ఆషామాషీగా చేపట్టలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే నాటికే సాగునీటి రంగాన్ని ఔపోసన పట్టిన ఆయన, రైతాంగాన్ని ఆదుకోవడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు ఎంతో కసరత్తు చేసినట్టు అనేక ఆధారాలు చెబుతున్నాయి. నిజానికి 1,465 కిలోమీటర్ల పొడువున్న గోదావరి.. తెలంగాణలో సుమారు 750 కిలోమీటర్ల ప్రవహిస్తుంది. ఇటు గోదావరి, అటు కృష్ణ రెండు నదుల మెజార్టీ పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉన్నా.. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇక్కడి ప్రాజెక్టులకు అన్యాయమే జరిగింది. తెలంగాణ బేసిన్‌ల నుంచి నీటిని కోస్తాంధ్రకు మళ్లించి, అక్కడ రెండు పంటలకు నీరిచ్చి ఈ ప్రాంత ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఈ పరిస్థితుల్లో గోదావరి, కృష్ణా నదుల్లోని నికర, మిగులు జలాలను సమర్థవంతంగా వినియోగించుకొని కోటి ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఆనాటి తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేసింది. అందుకోసమే నూతన జల విధానం (రీడిజైనింగ్)కు శ్రీకారం చుట్టింది. ఈ స్వప్నంలో మొదటి భాగం కాళేశ్వరం ఎత్తిపోతల పథకం! గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా విశ్వసనీయత కలిగిన నికర జలాల కేటాయింపులు 1,489 టీఎంసీలుంటాయని లెక్క గట్టి.. అందులో 954 టీఎంసీలను తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయింపులు కాగితాలకే పరిమితం కాగా, వాస్తవ వినియోగం ఏనాడూ 400 టీఎంసీలకు మించి లేదు. ఈ విషయాలను అధ్యయనం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, గోదావరి జలాల గరిష్ఠ వినియోగం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే సాధ్యం అవుతుందని భావించి ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. నాటి సమైక్య ప్రభుత్వాలు ఆదిలాబాద్ జిల్లా తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే అందులో కుట్ర దాగి ఉందని ఉద్యమ నాయకుడిగా ఉన్న సమయం నుంచి వాదిస్తూ వచ్చిన కేసీఆర్.. స్వరాష్ట్రం వచ్చాక అందులోని లోటుపాట్లపై ఆరా తీశారు. లోపాలను బహిర్గతం చేశారు. అంతేకాదు, ఈ ప్రాజెక్టు వెనుక దాగి ఉన్న కుట్రను అసెంబ్లీ సాక్షిగా గణాంకాలతో సహా కళ్లకు కట్టినట్టు వివరించారు. మేడిగడ్డ, తుమ్మిడిహట్టి వద్ద 47 ఏళ్ల నీటి లెక్కలను ఆధారంగా చేసుకొని, ఆ వాస్తవాలను శాసనసభ ముందు పెట్టారు. తుమ్మిడిహట్టి నీటి లభ్యత తక్కువగా ఉందని చెప్పడంతోపాటు ప్రాణహిత కలిసిన తదుపరి కాళేశ్వరం వద్ద 1,651 టీఎంసీల లభ్యత ఉందని, అలాగే గోదావరిలో ఇంద్రావతి కలిసే పేరూర్ వద్ద సరాసరి 2,430 టీఎంసీల లభ్యత ఉందని శాసనసభా సాక్షిగా వివరించారు. గోదావరిలో ఇంద్రావతి కలిసిన తర్వాత తుపాకుల గూడెం ప్రాజెక్టు చేపడుతామని, మేడిగడ్డ వద్ద భవిష్యత్‌లో ఎప్పుడైనా కొరత ఏర్పడినా ఇంద్రావతి నీటిని తీసుకునే అవకాశం ఉందటుందని, భవిష్యత్ అవసరాలకు ఇంద్రావతి, ప్రాణహిత నీళ్లే ఆధారమంటూ వివరించిన తొలి తెలంగాణ ముఖ్యమంత్రి.. అనతి కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని ఎగువకు మళ్లించారు.

### అంతర్మథనం?

రాష్ట్ర సాగునీటి రంగ ముఖచిత్రాన్నే మార్చివేసిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. మేడిగడ్డ వద్ద జరిగిన చిన్న సంఘటనను పెద్దదిగా చూపుతూ అబద్ధాలు ప్రచారం చేసి ఎన్నికల్లో విజయం సాధించిన ఆ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తదుపరి కూడా అదే పంథాను అనుసరిస్తున్నది. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం అన్నట్టు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతకు అద్దం పడుతున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విచారణ సందర్భంగా జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ చేసిన వ్యాఖ్యలు కాళేశ్వరం గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. 'తెలంగాణలో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మాణం చేశారు. దీనివల్ల కొన్ని వేల ఎకరాల్లో సాగు జరుగుతున్నది. తెలంగాణ వరి సాగులో ఎంతో పురోభివృద్ధి సాధించింది' అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్‌టాపిక్ కాగా, కాంగ్రెస్ నాయకులను మాత్రం అంతర్మమథనంలో పడేశాయి. నిజానికి ప్రాజెక్టు జాతికి అంకితం చేసిన 2019-20లోనే 61.66 టీఎంసీల నీటిని ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎత్తిపోసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే.. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా సుమారు 190 టీంఎసీలకు పైగా ఎత్తిపోశారు. దాని ఫలితంగానే రాష్ట్రంలో సాగునీటి ముఖచిత్రం మారింది. ఈ నేపథ్యంలో ఇకనైనా విమర్శలు మానుకొని, మేడిగడ్డకు పూర్వవైభవం తెచ్చి ప్రాజెక్టును రైతులకు అందుబాటులోకి తేవాలన్న డిమాండ్ రైతుల నుంచి వస్తున్నది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల తర్వాత కొంతమంది కాంగ్రెస్ నాయకుల్లో అంతర్మథనం కనిపిస్తున్నా.. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్న అభిప్రాయాలు ప్రస్తుతం ఆ పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

### నోటీసులు కాదు..
### రైతులకు అండగా నిలువండి

కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం గురించి దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సర్కారు పరిగణలోకి తీసుకోవాలి. రాజకీయ ప్రయోజనాలకన్నా రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా చేసుకొని ప్రాజెక్టును వెంటనే పునరుద్ధరించే కార్యక్రమం చేపట్టాలి. విమర్శలు, నోటీసుల వంటివి మానుకొని ప్రపంచ గుర్తింపు పొందిన ప్రాజెక్టుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నిజానికి కాళేశ్వరం నీళ్లతో సిరిసిల్ల, వేములవాడ లాంటి మెట్టప్రాంతాలు సస్యశామలం అయ్యా యి. ఇప్పుడు కాళేశ్వరం జలాలు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. సాగుభూములు బీడుగా మారుతున్నాయి. మళ్లీ సమైక్య కాలం నాటి పరిస్థితులు రాక ముందే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి ఎగువ ప్రాంతానికి నీటిని ఎత్తిపోసే కార్యక్రమం చేపట్టాలి. రైతులకు అండగా నిలువాలి. నోటీసులు, విమర్శలను ఇటు రాజకీయ పరంగా, అటు చట్టపరంగా ఎదుర్కొనే సత్తా సామర్థ్యం బీఆర్‌ఎస్‌కు ఉన్నాయి. అయితే మా పార్టీ తపన, పోరాటం అంతా కాళేశ్వరానికి పూర్వవైభం తెచ్చి.. రైతులకు అండగా నిలువడమే. అందుకోసం ఏ పోరాటానికైనా సిద్ధమే.



- చల్మెడ లక్ష్మీనరసింహారావు,
బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు

## కేసీఆర్‌పై కక్షతోనే నోటీసులు

- కోటి ఎకరాలకు సాగునీరందించడం కోసమే 'కాళేశ్వరం'
- ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ మొదటి నుంచి అడ్డుపడుతున్నది
- ఎస్‌ఎల్‌బీసీ టెన్నల్ ప్రమాద కారకులపై చర్యలేవీ?
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

కరీంనగర్, మే 22 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే కాళేశ్వరమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అభివర్ణించారు. ఈ ప్రాజెక్టుపై విచారించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఆయనతోపాటు అప్పటి మంత్రులు టీ హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు పంపించారని చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు పంపించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకే కాంగ్రెస్, బీజేపీ కలిసి ఈ చర్యలకు పాల్పడ్డాయని ఆయన ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రైతులు సాగునీటి కోసం పడిన బాధలను చూసి కేసీఆర్ ఎంతగానో చలించి పోయారని, ఈ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కోటి ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు మొదటి నుంచి అడ్డుపడ్డారని, ఈ ప్రాజెక్టు నిర్మాణంతో కేసీఆర్ ప్రజల్లో వచ్చిన ఖ్యాతిని, ఏర్పడిన గౌరవాన్ని రేవంత్ ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతున్నదని, నోటీసుల ద్వారా కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్‌ఎల్‌బీసీ టెన్నల్ కూలిపోయి అనేక మంది కార్మికులు చనిపోయినా ఇప్పటి వరకు బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని కొప్పుల ప్రశ్నించారు. ఎస్‌ఎల్‌బీసీలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతున్నదని, వాటిని మరిపించేందుకే ఇలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని, వాటిలో ఒక్కదానిని కూడా అమలు చేయలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ఉన్నదని ధ్వజమెత్తారు. రాజోయే రోజుల్లో కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.





జూలపల్లి : కొనుగోలు కేంద్రంలో చెల్లాచెదురైన ధాన్యం



సిరిసిల్ల మండలం పెద్దూరులోని ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కుప్పలపై వర్షపు నీటినిఎత్తిపోస్తున్న రైతు

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తుతున్న వడ్లు
- ఆందోళనలో రైతులు

కరీంనగర్, మే 22 (నమస్తే తెలంగాణ) :అకాల వర్షం రైతన్నను ముంచుతున్నది. బుధవారం రాత్రి, గురువారం సాయంత్రం పడిన వాన తీవ్ర నష్టం మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లు అలాగే ఉండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ఆగమయ్యారు. వర్షాలకు వడ్లు అక్కడక్కడ తడిసి మొలకెత్తగా కన్నీరుపెడుతున్నారు. దిక్కుతోచని స్థితిలో ఆదుకోవాలని వేడుకుంటున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో సుమారు గంటన్నర సేపు పడిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లెదురయ్యాయి. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. మేడిపల్లి, భీమారం మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్, శంకరపట్నం మండలాల్లోని అన్ని గ్రామాల్లో భారీ వాన కురిసింది. రెండు గంటల పాటు ఏకధాటిగా పడడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో భారీ వాన పడింది. పొత్తూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షపు నీరు చేరి ధాన్యం తడిసింది. బోయినపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వడ్లు తడిసిపోయాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు మంథని, జూలపల్లి, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్ల కుప్పలు తడిచాయి.



పెద్దపల్లి: ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు



సారంగాపూర్ : బీర్‌పూర్ మండలం కందెనకుంటలో ధాన్యం సెంటర్‌లో తడిసిన ధాన్యం



కొండగట్టులో మాల విరమణ చేయడానికి వచ్చిన హనుమాన్ దీక్షాపరులు

## 'కొండ'ంత జనం

మల్యాల, మే 22 : 'రామ లక్ష్మణ జానకి.. జై బోలో హన్మాన్‌కీ' 'శ్రీ రామ జయ రామ, జయ జయ రామ' అంటూ అంజన దీక్షాపరులు చేసిన రామ నామ సంకీర్తనలతో కొండగట్టు మార్మోగింది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా ఉప్పెనలా వచ్చిన దీక్షా పరులతో కొండగట్టు కాషాయవర్ణ శోభితమైంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు లక్షా ఇరవై వేల భక్తులు అంజనేయ స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్ననేపథ్యంలో ఆర్జిత సేవలను రద్దు చేసిన అధికారులు శనివారం నుంచి సేవలను ప్రారంభిస్తామని ఆలయ అధికారులు వెల్లడించారు.

## జీలుగ కోసం బారులు




జీలుగ విత్తనాలకు పాస్‌బుక్ జిరాక్సులతో క్యూలో రైతులు

గంభీరావుపేట, మే 22: జీలుగ విత్తనాలు పంపిణీ ఆలస్యం కావడం, అరకొర వస్తుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జీలుగ విత్తనాలు పంపిణీ ప్రారంభించగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్సు పత్రాలతో బారు లు తీరారు. గతంలో ₹1116 ఉన్న బ్యాగు ను సబ్సిడీ అని చెప్పి ఇప్పుడు ₹2132లకు అమ్ముతున్న విషయం తెలుసుకుని ఆగ్రహించారు. పండించిన వడ్లకు క్వింటాల్‌కు ₹100 పెంచలేదు కానీ, జీలుగ 30 కిలోల విత్తనాల ధరను డబుల్ చేయడం ఏంటని నిలదీశారు. తక్కువ బ్యాగులు రావడం, అరకొరే అందించడంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహించారు. మండలానికి 30 కిలోల చొప్పున 2 వేల బ్యాగులు అవసరమున్నదని ప్రతిపాదనలు పంపగా, 450 బ్యాగులు వచ్చాయని వ్యవసాయాధికారి సలావుద్దీన్ తెలిపారు.

## బీరప్ప వేడుకకు వెళ్తూ.. | రోడ్డు ప్రమాదంలో యువ రైతు దుర్మరణం



జగన్(ఫైల్)

పెద్దపల్లి రూరల్, మే 22: బంధువులు చేసుకుంటున్న బీరప్ప వేడుకలో పాల్గొనేందుకు వెళ్తూ ఓ యువ రైతు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం జరిగిన ఈ ఘటనతో మృతుడి స్వగ్రామమైన పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్‌తో పాటు బంధువుల గ్రామమైన రామగిరి మండలం లొంక కేసారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఎనుగుల జగన్(25) లొంక కేసారంలోని దగ్గరి బంధువుల ఇంటికి బీరప్ప వేడుకకోసం బుధవారం రాత్రి తన బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలోనే పెద్దపల్లి మండలం రంగాపూర్ వద్ద మంథని నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న కారు ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి జగన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నిఖితతో పాటు రెండున్నరేళ్లు, మూడు నెలల ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి ఎనుగుల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంతనగర్ ఎస్‌ఐ కే స్వామి తెలిపారు.